# సీతాపతి

ఉపద్రష్టసాయి

**సీతాపతికి తన మిత్రుల మధ్య రెండు పేర్లున్నాయి.ఒకటి సలహాల్రావు, మరొకటి సంథింగ్ సీతాపతి. ఈ రెండు పేర్లు అతనికి రావడానికి బలమైన కారణాలున్నాయి. అవి,అడిగినా అడగకపోయినా ఉచిత సలహాలు కుమ్మరించడం.మరొకటి ఎంతసేపూ "మనం సంథింగ్ చెయ్యాలయ్యా, లేకపోతే లాభం లేదు సీ" అని పదే పదే వల్లించడం.**

**పోనీ సీతాపతికి రకరకాల వ్యాపకాలు వున్నాయాఅంటే ఏమీ లేవనే చెప్పాలి.**

**పోనీ సీతాపతి ఏదైనా ఉద్యోగం గట్రా, లేదా వ్యాపారం గట్రా చేస్తున్నాడా అంటే అదీ లేదనే చెప్పాలి.**

ఎస్సెల్సి తప్పినప్పటి నుంచీ, గత రెండు దశాబ్దాలుగా సీతాపతి ఏ ఉద్యోగమూ చెయ్యలేదు. వ్యాపారం చెయ్యాలనుకోనూ లేదు అయినా అతను పెళ్ళి మాత్రం చేసుకున్నాడు. తత్ఫలితంగా వ్యాపకం కుదిరింది. ఆ వ్యాపకం పర్యవసానంగా ఇద్దరు పిల్లలకు తండ్రి కూడా కాగలిగాడు. జీవితంలో సీతాపతి సాధించగలిగిన హోదా ఒక్కటే, అది తండ్రి కావడమే.

"మరైతే సీతాపతికి జీవనోపాధి ఎలాగ" అనే సందేహం మీకు రావడం సహజమే, ఈ దేశంలో ఉద్యోగాలూ, వ్యాపారాలూ చెయ్యకుండా ఒక జీవితకాలం గడిపివేసే జనం కొందరున్నారంటే అది అబద్ధం కాదుస్మీ వాళ్ల తాతలూ, తండ్రులూ గడించి విడిచిపెట్టిపోయిన ఆస్తి పాస్తుల మీద బ్రతకడమే వాళ్ళ వ్యాపకం!

ఆ ఆస్తి పాస్తులను నాశనం చెయ్యకుండా వాటిమీద వచ్చే ఆదాయంతో గడపడమే వాళ్ళ చతురత. కోడిని కోడిగా వుంచుతూ గుడ్డుతో బ్రతికే తెలివి వాళ్ళ మూలధనం.

సీతాపతి తండ్రి ఆయన తాలూకు పిత్రార్జితంతో నగరంలో ఒక ఇల్లు కట్టుకుని, తర్వాత కొన్ని డబ్బులు వడ్డీకి తిప్పుతూ ఆ ఇంటి చుట్టూ మరో మూడురెండు గదుల ఫ్లాట్స్ కట్టి వాటిని అద్దెలకిచ్చి నిశ్చింతగా... ఒక్కగానొక్క కొడుకు సీతాపతితో భార్యా సమేతంగా బ్రతికాడు. అంతేకాదు. ఆయన రాష్ట్ర ప్రభుత్వంలో ఉద్యోగం కూడా చేశాడు.

మరో విధంగా అయితే సీతాపతికి కూడా తండ్రి తర్వాత రాష్ట్ర ప్రభుత్వంలో ఉద్యోగం వచ్చేదేమో. కానీ సీతాపతి ఎనిమిదవ తరగతి తర్వాత ప్రతీ క్లాసులోనూ రెండేళ్ళు కూర్చోవడంతో ఎస్సెల్సీకి వచ్చేసరికి చదువు మీద ఆసక్తి తగ్గిపోయింది.

అంతేగాక, సీతాపతికి మొదటి నుంచీ ఉపన్యాస ధోరణిలో గంటల తరబడి మాట్లాడటం అలవాటు, అతని చుట్టూ స్నేహితులు పోగవుతారు.

వాళ్ళు సీతాపతి మాటలకు బుర్రలు ఊపుతూ అతన్ని మరింత రెచ్చగొట్టడంతో సీతాపతి తెగసంతోష పడిపోయే వాడు. ఆ సంతోషం అనే మత్తులోపడి ఉపన్యాసమే వ్యాపకంగా చేసేసుకున్నాడు.

సీతాపతి తండ్రి కొడుకును ఉద్యోగంలో పెట్టడం ఎలాగూ సాధ్యం కాదు కనుక ఏదైనా కొట్టు పెట్టిస్తే వ్యాపారం చేస్తాడేమో అనుకుని ఆ ప్రయత్నం చేశాడు, కానీ అది కూడా ఫెయిలైంది.

సీతాపతి వచ్చిన కస్టమర్లను కూర్చోబెట్టి ఉపన్యాసాన్నిచ్చి మధ్య మధ్యలో టీ, కాఫీలు కూడా తెప్పించి తన వాగ్చాతుర్యాన్ని ప్రకటించడంతో లాభాలు కాస్తా టీ, కాఫీల రూపంలో కరిగిపోయేవి.

మరి లాభం లేదనుకున్న సీతాపతి తండ్రి కొట్టుమూయించేశారు.

మరికొద్ది కాలంలో ఆయన అనారోగ్యంతో పోవడం మరో రెండేళ్ళ తర్వాత సీతాపతి తల్లి కూడ పోవడం జరిగింది. అప్పటికే సీతాపతికి పెళ్ళైంది.

సీతాపతి భార్య సుందరి పేరుకు తగ్గట్టు అందంగా వుండడమే కాకుండా గుట్టుగా కాపురం చేసేది.

అద్దెల మీద ఇల్లు జరిపేది.అడపా దడపా భర్తతో "మీరిలా పడక కుర్చీలో కూర్చుని సలహాలిస్తూ ఉపన్యాసాలు దంచుతూ వుండకుండా ఏదైనా చెయ్యరాదూ" అనేది.

"చెయ్యాలి.. చెయ్యాలి.. సంథింగ్ చెయ్యాలి" అనేవాడు గానీ చేసేవాడు కాదు.

సీతాపతి ఇంట్లో అద్దెకున్న వాళ్ళు వామన మూర్తి, తలుపయ్యా, కాజాల్రావు.ఈ ముగ్గురూ పక్తి తీర్థంలోకి పక్షులు వచ్చేలా ఠంచన్‌గా సీతాపతి ఇంట్లోకి మధ్యాహ్నం పూట వచ్చి వాలే వాళ్ళు.

వాళ్ళు రాగానే సీతాపతి గాలికొట్టిన బెలూన్‌లా ఉబ్బిపోయేవాడు. మరప్పుడు మొదలెట్టేవాడు.

"మనం ఏదో సంథింగ్ చెయ్యాలండీ..." అనేవాడు తలుపయ్య.

"చెయ్యాలంటే ఎన్నో వున్నాయి, తలుపూ... అసలీ షేర్లున్నాయి చూశావూ షేర్లు, అందులో పెడితే సొమ్ము అలా మీటరులా పెరిగి పోతుందయ్యా, అసలీ దశాబ్దం షేర్లదయ్యా. గజం రెండు గజాల భూమి వున్నవాడు కూడా అందులో పెట్టేసి ఎప్పేట్లు కొనేస్తున్నాడు. అదేదో మంచిదైను..." అనేవాడు.

ఓ పావుగంట షేర్లమీద ఉపన్యాసం దంచేవాడు.

తిరిగ్గా ఈసుపోక పుస్తకాల్లో చదివినవన్నీ వాళ్ళకి బాగా వంటబట్టేలా చెప్పేవాడు.

ఇంతలో కాజాల్రావు "అది సర్లెండి! ఈ పేర్లు కాక మరోటి చెప్పండి." అని పొయ్యి కాస్త ఊది వదిలేసే వాడు, అంతే సీతాపతి రాజుకునేవాడు.



"ఏం... తెలీదనుకున్నావా అంట. చూడు తిండి అంటే జనంపడి చచ్చిపోతున్నారయ్యా. ఎంచక్కా ఇంట్లో పీకల దాకా భోంచేసి బజారు మీదికి రాగానే గుప్పుమని మసాలా గారే వాసన తగలగానే బ్రేకువేసిన బండిలా ఆగిపోయి రెండు గార్లు లాగించి, జేబులోని చిలుము వదిలించుకుని గానీ మరో కార్యక్రమం చూసుకోడు మనిషి, అట్లాంటి వాళ్ళు కొందరున్నారు. కనక 'స్నాక్ బార్' లాంటిది పెడితే జనాన్ని కుమ్మేయవచ్చు. ఎలాగుంది ఐడియా... ఎంచక్కా గారెలు, సమోసాలు, కాస్త స్వీట్లు పెట్టి, టీ, కాఫీలు సప్లై చేస్తే చాలు.... లిఫ్టెక్కి పైకెళ్ళినట్లు పైకెళ్ళి పోగలవు" అని ఫినిషింగిచ్చాడు.

"బ్రహ్మాండమైన ఐడియా..." అనేవాడు వామనమూర్తి.

"ఇది మాత్రం కాదు వామన మూర్తీ... ఈ రియల్ ఎస్టేట్ వ్యాపారం వుంది చూశావూ... అది తెగ వేడిగా వుంది. అపార్ట్‌మెంట్స్ తెగలేస్తున్నాయి. నేలకొని అమ్మడం యమజోరుగా సాగుతోంది. మంచి నేల చూడడం.. అడ్వాన్సివ్వడం... మరో బయ్యర్‌ను పట్టుకుని ఆ నేల అమ్మడం... కమీషన్ సంపాదించడం, రియల్ ఎస్టేట్ రిచ్‌గా వుంటూందిట. చెయ్యాలి గానీ వ్యాపారాల్లేకనా" అని ముగించేవాడు సీతాపతి.

మధ్యలో 'సుందరీ' అని కేకవేసి కాఫీలు పట్రమ్మనేవాడు. మొదట్లో సుందరి జోరుగా కాఫీలు సప్లై చేసేది, ఆ రకంగా సలహాలిస్తూ సీతాపతి ఏమైనా చేస్తాడేమో అనే ఆశతో!

కానీ అలాంటిదేమీ జరగలేదు. పైగా ఆ త్రిమూర్తులు రోజా రావడం సీతాపతి సలహాలు ఉప్పెనలా వదలడం, వాళ్ళు కాఫీలు తాగి వెళ్ళడం జరిగేది. దాంతో సుందరికి కోపం వచ్చి కాఫీలకు స్వస్తి చెప్పింది.

కొంతకాలం అయ్యాక సడెన్‌గా త్రిమూర్తులు రావడం మానేశారు. డ్రగ్స్‌కు అలవాటుపడిన వాడిలా మధ్యాహ్నం అయ్యాక త్రిమూర్తులు రాకపోవడంతో సీతాపతికి తోచుకోట్లేదు.

తనలో పేరుకుపోయిన సలహాల రిజర్వాయర్‌ను తెరవడానికి చాన్సు లేకపోయింది. దాంతో సీతాపతి కాస్త డీలా పడిపోయాడు.

మరి కొంతకాలం తమాయించుకుని తనే వాళ్ళ ఇళ్ళకు వెళ్ళడం మొదలుబెట్టాడు, కానీ ఫలితం దక్కలేదు.

తిలువయ్య ఇంటి కెళ్తే అతని భార్య "ఆయన పనిలో వున్నారు... తర్వాత వస్తారు" అనేది.

"ఏం... పనో..." అనుకుంటూ వామనమూర్తి ఇంటికెళ్తే "ఆయనింట్లో లేరు, సాయంత్రమొస్తారు" అనేది అతని భార్య.

పోనీ కాజాల్రావింటికెళ్తే "ఇప్పుడే వచ్చేసి పడుకున్నారు. తర్వాత వస్తారు" అనేది అతని భార్య.

ఈ రకంగా మూడు నెలలు సీతాపతి వాళ్ళ కోసం ప్రయత్నించడం వాళ్ళు దొరక్కపోవడం జరిగింది.

ఒకవేళ దొరికినా "అర్జెంటు పని... తర్వాత కలుస్తాను" అని వెళ్ళిపోయేవాళ్ళు త్రిమూర్తులు.

వీళ్ళ వాలకం చూసిన సీతాపతికి ఏమీ అర్థం కాలేదు. "రోజూ నా చుట్టూ తిరిగిన వాళ్ళు ఇప్పుడు నాకే టోపీ పెడుతున్నారా" అనుకున్నాడు.

"సరే! వీళ్ళ పని చూస్తాను. వచ్చే నెలనుంచి అద్దెలు పెంచుతాను, దాంతో చచ్చినట్లు దార్లోకి వస్తారు" అనుకున్నాడు సీతాపతి.

మరో వారం రోజులు గడిచాయి.

ఒక మధ్యాహ్నం పూట కాజాల్రావు సీతాపతి ఇంటికి వచ్చాడు. సీతాపతి పడక్కుర్చీలో కూర్చుని చందమామ చదువు కుంటున్నాడమేతి వాసన ముక్కు కు తగలగానే గట్టిగా పీల్చి తలెత్తి చూసేవరికి ఎదురుగుండా కాజాల్రావు సిల్క్ లాల్చీ, పైజామాతో రిచ్‌గా కనిపిస్తున్నాడు. చేతిలో పెద్ద పాకెట్.

"ఏం... కాజా... ఇన్నాళ్ళకి నేను గుర్తుకొచ్చానా? కోపంగా అడిగాడు సీతాపతి.

"అమ్మమ్మ... అలా కోప్పడకండ్సార్...అంతా మీ చలవ...మీకు ఋణపడున్నాన్సార్" అన్నాడు కాజాల్రావు.

"అదేంటయ్యా...వివరంగా చెప్పు." అడిగాడు సీతాపతి.

కాజాల్రావు కుర్చీలో కూర్చున్నాడు, "అమ్మగార్ని పిలవండి" అన్నాడు.

"సుందరీ..." కేకవేశాడు సీతాపతి.

సుందరి రాగానే కాజాల్రావు లేచి వినయంగా నమస్కరించి "అమ్మా... ఇవి మా 'స్నాక్ బార్'లో తయారుచేసిన స్వీటూ, కారం... ఇదంతా మీ వారి సలహాల ప్రతిఫలం..." అన్నాడు, కాజాల్రావు బాక్స్ సుందరికి ఇస్తూ.

సీతాపతికి ఏమీ అర్థంకాలేదు.

"అసలేమిటయ్యా - స్నాక్ బార్ తెరిచావా - నాతో ఓ మాట కూడా చెప్పలేదే..." విసుక్కున్నాడు సీతాపతి.

"క్షమించాల్సార్... స్నాక్ బార్ తెరిచి నెలరోజులైంది నిలదొక్కుకోగలననే నమ్మకం వచ్చింది. అందుకే నిలదొక్కుకున్నాక మిమ్మల్ని పిలవాలనుకున్నాను. అంతా మీరిచ్చిన సలహాల వల్లే జరిగిందన్సార్." అన్నాడు వినయంగా కాజ్రావు.

"గుడ్...గుడ్... వెరీగుడ్. ఆ... వచ్చేనెల నుంచి మీ ఇంటికి అద్దె పెంచుతున్నాను కాజ్రావ్." అన్నాడు సీతాపతి.

"వద్దు సార్... నేను స్నాక్ బార్ దగ్గర్లో ఓ ఇల్లు చూశాను. అడ్వాన్స్ కూడా పే చేసేశాను. వచ్చేనెల ఇల్లు **ఖాళీ** చేసేస్తాన్సార్... నా ఎడ్వాన్స్... తిరిగి ఇచ్చేస్తే బాగుంటుంది" నీళ్లు నములుతూ అన్నాడు కాజ్రావు.

సీతాపతికి కాస్త షాక్ తగిలింది.

తేరుకునే లోగా వామనమూర్తి, తలుపయ్యా ఇద్దరూ వచ్చారు. ఇద్దరూ ఖరీదైన బట్టలు తొడుక్కున్నారు. తలుపయ్య సఫారీ తొడుక్కున్నాడు. డ్రమ్ముకు బట్టలు తొడిగితే ఎలాగుంటుందో అలాగున్నాడు తలుపయ్య.

వాళ్ళిద్దరూ పూర్తిగా మారిపోయారు.


"ఏంటయ్యా... ఏమైంది... నాటకాల్లో గట్రా వేషాలు వేస్తున్నారా" అడిగాడు సీతాపతి.

వాళ్ళిద్దరూ చిరునవ్వులూ నవ్వుతూ,

"అబ్బే... అదేం కాదండీ... అంతా మీ భిక్ష. మీ దయ.... నేను సేర్లలో దిగానండి, మూన్నెల్ల క్రితం. అవి కాస్త ఎల్స్ చేసిందండి. గిరగిర తిప్పాన్సార్. సేతులు మార్చి సేర్ల యాపారం సేస్తున్నా, మంచి లిస్ట్ వచ్చిందండి. ఈ పరిస్థితి రావడానికి మీరే కారణమండి.

సేర్ల మీద క్లాసులు జరిపారు కదా... అదంతా వంట బట్టించుకుని మా యావిడ నగలమ్మి దిగాను., 'ధైర్యే సాహసే లక్ష్మీ' అన్నట్లు ఇప్పుడు బాగా పుంజుకున్నాన్సార్." అన్నాడు వామనమూర్తి.

"మరీ నువ్వూ..." తలుపయ్య నడిగాడు సీతాపతి. అప్పటికే తలుపయ్య సీతాపతి ఇంటి గోడల మీద చేత్తో గుద్దుతూ పరీక్ష చేస్తున్నాడు.



"నిన్నేనయ్యా" అడిగాడు సీతాపతి.

"ఆ... ఈ మధ్య రియల్ ఎస్టేట్‌లో దిగాన్సార్. రెండు కేసులు ఫినిష్ చేశాను. లైను బాగానే వుంది. కిటుకులు పట్టుకుంటున్నాను. ఆ... మరిచిపోయాను. ఇదిగోనండి... వామనం... నీది కూడా తీయ్..." అంటూ ఇద్దరూ జేబుల్లోంచి రెండు గిఫ్ట్ ప్యాకెట్లు తీశారు బయటికి.

"ఏమిటయ్యా ఇవి..." అడిగాడు సీతాపతి.

"ఒకటి నాది... చిన్న ఉంగరం సార్...

రెండోది వామనమూర్తిది... మీకొక వాచీ సార్" అన్నాడు తలుపయ్య.

"మా తృప్తికోసం సార్... మీరురోజూ చిట్టి సలహాలిచ్చీ సలహాలిచ్చీ సంథింగ్ చెయ్యాలీ సంథింగ్ చెయ్యాలీ అని తోమక పోతే మేము ఈ సంథింగ్ చేసుండే వాళ్ళం కాంసార్. మాలోని నిద్రాణమైన శక్తిని బయటికి తీసిన వారుమీరే కదా, అందువల్ల మీకీ చిన్న కానుకల్సార్. బైది బై సార్... మేమిద్దరం వచ్చేనెల ఇల్లు **ఖాళీ చేసేస్తాం** సార్... వ్యాపారానికి తగినట్లు కాస్త 'గెట్ అప్' గా వున్న ఇంట్లో వుండకపోతే 'ఇమేజ్' దెబ్బతింటుందన్సార్. కనుక మీరు మా ఎడ్వాన్స్‌లు తిరిగిచ్చేస్తే మేం వేరే ఏర్పాటు చేసుకుంటాం సార్. ఆ... ఈ కాజ్రావు కూడా స్నాక్ బార్ తెరిచాడు..." అని కాజాకేసి చూశాడు వామనమూర్తి.

"అదే... చెప్పాను సారుకి..." అన్నాడు కాజ్రావు.

సీతాపతి నుదుటికి చెమట పట్టింది.

నోటమాట రాలేదు.

తమాయించుకుని మెల్లగా "చాలా... సంతోషమయ్యా... వెరీగుడ్... మంచిపని చేశారు... విష్ యూ ఆల్ సక్సెస్ ... " అన్నాడు సీతాపతి.

సుందరి మొహం పాలిపోయింది...

మరి కాసేపు వాళ్ళు మాట్లాడుకున్నారు.

తరువాత త్రిమూర్తులు వెళ్లిపోయారు.

పాలిపోయిన సుందరి మొహం కందగడ్డలా మారింది. భర్త కేసి కొరకొర చూసింది.

"మీరూ... మీ సలహాల్నూ.... పడక్కుర్చీలో కూర్చుని కాళ్ళు జాచుకుని సలహాలు విదిలిస్తే చాలదు... వాళ్ళని చూసి తెలుసుకోండి..." అని ఇంకా ఏవో తిడుతూంటే ఆవేశంగా లేచాడు సీతాపతి.

"ఇన్నాళ్ళూ ఈ సీతాపతి కేవలం సలహాల సీతాపతీ... సంథింగ్ సీతాపతీ...! చూడు సుందరీ... అచిరకాలంలోనే ఈ సీతాపతి... సక్సెస్‌ఫుల్ సీతాపతి అని నిరూపిస్తాడు" అంటూ బాత్‌రూం కేసి నడిచాడు! 'సక్సెస్ ఫుల్ సీతాపతి అని నిరూపిస్తాను' అని బాత్‌రూంకేసి నడుస్తాడేమిటీయన అని నివ్వెరపోయి చూసింది సుందరి.

* * *

## పాపం కరిష్మా

కరిష్మా ఇటీవల ఓ షూటింగ్‌లో గాయపడి కొన్ని రోజులు ఇంట్లో విశ్రాంతి తీసుకోవల్సి వచ్చింది. ఇందులో ఆమె పొరపాటు లేకపోడం గ్రహపాటు!

ఓ చిత్రానికి సంబంధించిన ఓ డాన్సర్ మీద పడిపోవడంతో కరిష్మాకపూర్ గాయపడింది. దాంతో షూటింగ్‌లకు గుడ్‌బై చెప్పి కొన్నాళ్ళు రెస్ట్ తీసుకోవల్సి వచ్చింది! పాపం కరిష్మా!

-మౌర్య

